

చర్చి వార్షికోత్సవానికి వేళాయె..

జిలాల్లోనే అతి పెద్దదైన తల్లాడలోని లూర్దుమాత చర్చి 27వ వార్షికోత్సవ వేడుకలు గురువారం మొదలుకానున్నాయి.

8లో



మిర్చి రైతుల్లో ఆందోళన

ధర పతనంతో మిర్చి రైతుల్లో ఆందోళన నేపథ్యాన ప్రభుత్వం కలగచేసుకోవాలని ఏఐయూకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

8లో

గరిష్ఠం / కనిష్ఠం
37° / 17°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి.

న్యూస్‌రీల్

అందుబాటులోకి మద్దులపల్లి మార్కెట్



పూజలు చేస్తున్న ఏడీ లక్ష్మణుడు

ఖమ్మంరూరల్: రూరల్ మండలం మద్దులపల్లిలో నిర్మించిన వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం నుంచి పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు మొదలయ్యాయి. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ ఆర్.లక్ష్మణుడు పూజలు చేసి లాంఛనంగా కొనుగోళ్లను ప్రారంభించి మాట్లాడారు. ఖమ్మం మార్కెట్‌కు రోజురోజుకూ మిర్చి తీసుకొస్తున్న రైతుల సంఖ్య పెరుగుతోందని తెలిపారు. ఈ నేపథ్యాన అక్కడ ఆలస్యంగా కాకుండా మద్దులపల్లిలోనూ కొనుగోళ్లు ప్రారంభించామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఎంఓ అలీం, ఖమ్మం మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఈఈ ఎల్లేష్, టెక్నికల్ కన్సల్టెంట్ రావి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్వో పద్మశ్రీ

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం – నల్లగొండ – వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ఈనెల 27న పోలింగ్ జరగగనుండగా పారదర్శకంగా పూర్తిచేసేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఏ.పద్మశ్రీ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వగా ఆమె మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో అందరికీ అనుభవం ఉన్నప్పటికీ, ఏ పొరపాటు జరగకుండా పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. జిల్లాలోని 4,089 మంది ఓటర్ల కోసం 24 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని చెప్పారు. ఈనెల 27న ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. తొలుత పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, బ్యాలెట్ బాక్స్‌ల తనిఖీ తదితర అంశాలపై మాస్టర్ ట్రెయినీలు రాజేశ్వరి, మాధవి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ స్వామి, డీటీ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్లలో పనుల పరిశీలన



సబ్ స్టేషన్‌లో సూచనలు చేస్తున్న సీఈ రాజుచౌహాన్

ఖమ్మంవ్యవసాయం/మధిర/పెనుబల్లి/తల్లాడ: వేసవిలో అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా కోసం జిల్లాలోని పలు స్టేషన్లలో పనులు నిర్వహిస్తున్నారు. ఈమేరకు పనులను ఎన్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్(ఆపరేషన్స్) రాజుచౌహాన్ బుధవారం పరిశీలించారు. జిల్లా కేంద్రంతో పాటు తల్లాడ, పెనుబల్లి, సత్తుపల్లి, కల్లూరు తదితర ప్రాంతాల్లోని సబ్ స్టేషన్లలో చేపట్టిన పనులను ఆయన పరిశీలించి సూచనలు చేశారు. సబ్‌స్టేషన్లలో లైన్ల మార్పు, ఇతర పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. అలాగే, మధిరలోని శివాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 100 కే.వీ. ట్రాన్స్‌ఫార్మర్‌ను సీఈ ప్రారంభించారు. మహాశివరాత్రి సందర్భంగా జరిగే జాతరకు హాజరయ్యే భక్తులకు ఇబ్బంది ఎదురుకాకుండా నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమాల్లో ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్, డీఈలు ఎల్.రాములు, శ్రీనివాసరావు, ఏడీఈలు ఎం.అనురాధ, ఎస్.సతీష్, కిరణ్, ఏఈలు ఎస్.అనిల్‌కుమార్, ఎస్.మైథిలి, జి.అనూష పాల్గొన్నారు.

పోలేపల్లి ఓటర్ల జాబితా ప్రచురణకు ఓకే..

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి గ్రామపంచాయతీ ఓటర్ల జాబితా ప్రచురణకు ఎన్నికల సంఘం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే జిల్లాలోని అన్ని జీపీల ఓటర్ల జాబితాలు వెల్లడించగా సాంకేతిక కారణాలతో పోలేపల్లిలో నిలిచిపోయింది. తాజా ఆదేశాలతో 12వార్డులతో కూడిన ఈ గ్రామపంచాయతీలో 14వ తేదీన ఓటర్ల జాబితా విడుదల చేస్తారు. అలాగే, 14నుంచి 16వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి, 17వ తేదీన పరిష్కరిస్తారు. ఆపై 18వ తేదీన తుది జాబితా విడుదల చేయనున్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా జిల్లా యంత్రాంగం రంగంలోకి దిగింది. రానున్న రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత రావొద్దన్న ప్రభుత్వ ఆదేశాలతో ఆ దిశగా చర్యలు చేపడుతోంది. జిల్లాలోని మున్నేరు, పాలేరు, ఆకేరు, వైరా, కట్టలేరు, బుగ్గవాగు, నిమ్మవాగుల నుంచి ఇన్నాళ్లు అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు చేపడుతూ తరలిస్తున్నారు. మరోవైపు స్థానిక అవసరాలు, ప్రభుత్వ భవన నిర్మాణాల కోసం తహసీల్దార్లు ఇచ్చే కూపన్ల మాటున దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. అయినా యంత్రాంగం నామమాత్రపు తనిఖీలు, చర్యలతోనే సరిపెట్టింది. ఇంతలోనే ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశించడంతో జిల్లాలోనూ కట్టడికి అడుగులు పడ్డాయి. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం

అక్రమాలకు అడ్డుకట్ట

ఇసుక రవాణాను అడ్డుకునేలా కదిలిన యంత్రాంగం

- జిల్లాలో ఐదుచోట్ల చెక్‌పోస్టుల ఏర్పాటు
- ఇందిరమ్మ ఇళ్లకు కొరత ఎదురుకాకుండా జాగ్రత్తలు
- ఇన్నాళ్లు కూపన్ల మాటున అడ్డగోలుగా తవ్వకాలు



సత్తుపల్లి పెదవంతెన సమీపాన సీజ్ చేసిన ఇసుక వద్ద పోలీసులు

అనుమతులు లేకుండానే..

గత ఏడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు మున్నేరు, ఆకేరు, పాలేరు, వైరా, కట్టలేరుతో పాటు ఇతర వాగులు, పరీవాహకాల్లో ఇసుక చేరింది. ఇది దందారాయుళ్లకు కలిసొచ్చింది. కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, కొణిజర్ల, కారేపల్లి, మధిర తదితర మండలాల్లో ఈ ఏర్లు, వాగుల ఒడ్డున ఉన్న ఇసుకను అనుమతి లేకుండానే అర్ధరాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు చేపట్టి తరలించడం మొదలుపెట్టారు. అయితే, ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు తనిఖీల మాటెత్తకపోవడంతో అక్రమార్కులు ఆడిందే ఆట, పాడిందే పాట అన్నట్లుగా సాగింది. ట్రాక్టర్లలో ఇసుకను మండల కేంద్రాలకు తరలిస్తూ రూ.4 వేల నుంచి రూ.5వేల చొప్పున విక్రయిస్తుండడం గమనార్హం. కొందరైతే ట్రాక్టర్లకు నంబరు ప్లేట్ లేకుండానే ఇసుక తరలిస్తున్నా ఇన్నాళ్లు చర్యలు తీసుకున్న దాఖలాలే లేవు.

పేరుకే కూపన్

జిల్లాలోని వాగుల పరీవాహకాల్లో పలుచోట్ల ప్రభుత్వం ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చింది. స్థానిక అవసరాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పనుల నిమిత్తం తహసీల్దార్ల అనుమతి తప్పనిసరి చేసింది. అయితే ఒక ట్రిప్‌కు కూపన్ తీసుకుని రెండు, మూడు ట్రిప్పుల ఇసుక తరలిస్తున్నా రెవెన్యూ సిబ్బంది పట్టించుకోకపోవడంతో దందా మూడు పూలు, ఆరు కాయలుగా కొనసాగింది. కొందరిపై పోలీసులు అప్పుడప్పుడు కేసులు నమోదు చేసినా ఒకటి, రెండు రోజులకే పాత బాట పట్టడం మొదలైంది. కొన్నిసార్లు ఏర్లు, వాగుల్లోకి ట్రాక్టర్లు వెళ్లకుండా కందకాలు తీసినా దారులు మార్చుకున్నారే తప్ప దందా మాత్రం మానడం లేదు.

వట్టిపోతున్న వాగులు

అడ్డగోలుగా ఇసుక తవ్వకాలతో ఏర్లు, వాగులు, వంకలు రూపురేఖలు కోల్పోతున్నాయి. వరదకు వచ్చిన ఇసుక తవ్వకంతో రాళ్లు తేలుతున్నాయి. మున్నేరు, వైరా, ఆకేరు, కట్టలేరులో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. అంతేకాక పరీవాహకాల్లోని వ్యవసాయ బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి రైతులు ఇబ్బంది ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. మున్నేరులో ఇసుక తవ్వకాలు చేపట్టొద్దని బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాలకు చెందిన పరీవాహక రైతులు ఆందోళన చేసినా ఎవరూ పట్టించుకోలేదు.

‘చెక్’ పెట్టేలా..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని ఇప్పటికే లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఆతర్వాత విడతల వారీగా నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. నిర్మాణాలకు ఇసుక కీలకం కావడంతో ఎక్కడ కొరత రాకుండా ఇప్పటినుంచే కట్టడి చేయాలని ఆదేశించింది. దీంతో జిల్లాలోని ఐదు చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. కామేపల్లి మండలం కొత్తలింగాల క్రాస్, ముదిగొండ మండలం వల్లభి, బోనకల్లు మండలం వత్సవాయి, మధిరలోని ఆత్కూరు క్రాస్, సత్తుపల్లిలోని గంగారం రింగ్‌సెంటర్‌లో వీటిని ఏర్పాటుచేసి పోలీసు, మైనింగ్ శాఖల ఉద్యోగులు వాహనాల తనిఖీ ముమ్మరంగా చేపడుతున్నారు.



ముదిగొండ మండలంలోని వల్లభి వద్ద చెక్‌పోస్ట్‌లో పరిశీలిస్తున్న సీఐ మురళి

అనుమతి ఉంటేనే..



ప్రభుత్వపరంగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తున్నాం. జిల్లాలో ఎక్కడా టీఎస్ఎండీసీ రీచ్‌లు లేవు. భద్రాద్రి జిల్లా నుంచి మన జిల్లాలోకి ఇసుక తీసుకొచ్చినా అనుమతి తప్పనిసరి. జీరో బిల్లు, డబుల్ ట్రిప్, అదనపు లోడ్, నకిలీ బిల్లులను గుర్తించినా కేసులు నమోదు చేస్తాం. ఏపీ నుంచి సైతం జిల్లాలోకి ఇసుక వాహనాలను అనుమతించేది లేదు. జిల్లాలోని ఐదు చెక్ పోస్టుల వద్ద తనిఖీలు చేపడుతున్నాం.

– సునీల్‌దత్, పోలీసు కమిషనర్

కదిలిన అధికార యంత్రాంగం

- రేగళ్లపాడు ఆయిల్‌ఫెడ్ నర్సరీలో గుట్టుగా విచారణ
- ‘ఆఫ్‌టైప్’ మొక్కలు, ఇతర అంశాలపై ఆరా



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న వరంగల్ జేడీఏ సంగీతలక్ష్మి, అధికారులు

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం రేగళ్లపాడు ఆయిల్‌ఫెడ్ నర్సరీలో జరుగుతున్న అక్రమాలు, లక్షల సంఖ్యలో ఆఫ్‌టైప్(నాటడానికి పనికిరానివి) మొక్కలు బయటపడిన అంశంపై అధికారులు ఎట్టకేలకు విచారణ చేపట్టారు. విదేశాల నుంచి రేగళ్లపాడు నర్సరీకి దిగుమతి చేసుకున్న ఆయిల్‌పామ్ మొక్కలు కొన్నాళ్లకు పనికిరానివిగా తేలడం, ఆపై ఉన్నతాధికారులకు సమాచారం లేకుండానే ధ్వంసం చేయడం, మిగిలిన వాటికి అంటుకట్టడం తదితర అంశాలపై ‘సాక్షి’లో వరుసగా కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా ఆదేశాల మేరకు మంగళ, బుధవారాల్లో ఉద్యానవన శాఖ అధికారులు స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వకుండానే విచారణ నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. వరంగల్ జేడీఏ సంగీతలక్ష్మి, ఉద్యానవన అధికారులు మధుసూదన్, ఇర్ఫాన్‌తో కూడిన బృందం తొలిరోజు నర్సరీలో మొక్కలను పరిశీలించారు. కోస్టారీకా దేశం నుంచి దిగుమతి చేసుకున్న తంబా రకం సీడ్ లింగ్స్ ఆఫ్‌టైప్‌గా తేలడంపై నర్సరీ మేనేజర్ బాలకృష్ణారెడ్డిని ప్రశ్నించారు. అంతేకాక మూడు లక్షల మొక్కల్లో 80వేల మొక్కలు ధ్వంసం చేయడానికి కారణమేమిటి, మిగిలిన 2.20 లక్షల మొక్కలు ఎదుగుదల ఎలా ఉందో ఆరాతీశారు. ఇక రెండో రోజైన బుధవారం నర్సరీ మేనేజర్ బాలకృష్ణారెడ్డితో పాటు ఇదే ఆరోపణలపై గతంలోనే తొలగించిన సూపర్‌వైజర్లు పృథ్వీలాల్, కృష్ణారావు నుంచి లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్లను సత్తుపల్లి ఆయిల్‌ఫెడ్ కార్యాలయంలో తీసుకున్నారు.

ఎందుకు గుట్టుగా విచారణ?

ఉద్యానవన శాఖ అధికారులు గుట్టుగా వచ్చి కేవలం రేగళ్లపాడు నర్సరీలో విచారణ చేపట్టడంపై ఆయిల్‌పామ్ రైతులు మండిపడుతున్నారు. రేగళ్లపాడు నర్సరీ నుంచి ఇచ్చిన మొక్కల్లో ఆఫ్‌టైప్ కారణంగా నష్టపోయామని ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు ఇప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా నర్సరీకి రావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఆఫ్‌టైప్ మొక్కల కారణంగా సుమారు 200 ఎకరాల్లో పంటకు నష్టం ఎదురైందని చెబుతున్నారు. కాగా, ఈ విషయమై అధికారులను వివరణ కోరగా పూర్తిస్థాయిలో నివేదికను ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్‌బాషాకు ఇస్తామని తెలిపారు. అంతే తప్ప ఇతర వివరాలు వెల్లడించడానికి నిరాకరించడం గమనార్హం.

అయినా.. జాగ్రత్తగా ఉండండి

- జిల్లావ్యాప్తంగా కోళ్లఫామ్‌ల్లో అధికారుల తనిఖీలు, అవగాహన
- చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన భద్రత



కల్లూరు రూరల్ : పేరువంచలోని కోళ్ల ఫామ్‌లో పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి వెంకటనారాయణ, తదితరులు

ఖమ్మంవ్యవసాయం: కోళ్లకు వైరస్ సోకుతుందనే ప్రచారంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలోని పెనుబల్లి, కల్లూరు తదితర మండలాల్లో కోళ్లు మృత్యువాత పడినా కారణమేమిటో ఇంకా నిర్ధారణ కాలేదు. అయినప్పటికీ వైరస్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కోళ్ల ఫామ్‌ల నిర్వాహకులకు సూచనలు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఇప్పటికే ఏపీ నుంచి కోళ్లు, దాణా దిగుమతి కాకుండా ఐదు చోట్ల చెక్ పోస్టుల్లో విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఈక్రమంలోనే బుధవారం జిల్లా పశుసంవర్ధక, పశువైద్యాధికారి డాక్టర్ వెంకటనారాయణ చెక్‌పోస్టులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే, కోళ్ల పరిశ్రమల్లోనూ తనిఖీ చేసి రసాయనాల ద్వారా శుభ్రం చేసుకోవడం, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లు లేవని స్పష్టం చేశారు.

■ **కల్లూరురూరల్/సత్తుపల్లిరూరల్/బోనకల్/ముదిగొండ:** కల్లూరు మండలంలోని పేరువంచ, నారాయణపురం, సత్తుపల్లి మండలం తుంబూరులో కోళ్ల ఫామ్‌లను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటనారాయణ పరిశీలించారు. ఫామ్‌లు, చికెన్ షాపులో శానిటేషన్‌పై అవగాహన కల్పించారు. అలాగే, బోనకల్, ముదిగొండ మండలం వల్లభిలోని చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను అధికారులు పరిశీలించారు. అదనపు డీసీపీ ప్రసాదరావు, ముదిగొండ సీఐ ఓ.మురళి, తహసీల్దార్లు శివ, పులి సాంబశివుడు, పున్నంచందర్, సునీత ఎలిజబెత్, ఎస్సై మధుబాబు, వివిధ శాఖల ఉద్యోగులు మమత, శశిదీప్, లక్ష్మణ్‌నాయక్, అశోక్, రమేష్‌బాబు, ధర్మేందర్ పాల్గొన్నారు.

నేరుగా విత్తే విధానంలో లాభాల పంట



సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న రవికుమార్

కూసుమంచి: నాట్లు వేయడం కంటే నేరుగా విత్తుకునే విధానంలో వరి సాగు చేస్తే లాభం ఉంటుందని వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ కె.రవికుమార్ తెలిపారు. కూసుమంచి మండలం గోపాలరావుపేటలో నేరుగా వరి విత్తే పద్ధతి, వరి సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు ఆయన బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కోఆర్డినేటర్ మాట్లాడుతూ సమయానికి కూలీలు దొరకక నారు ముదిరిపోతే రైతులకు నష్టం ఎదురవుతుందని తెలిపారు. ఈనేపథ్యాన నేరుగా విత్తనాలు చల్లి సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడమే కాకుండా దిగుబడి పెరుగుతుందని చెప్పారు. ఏఓ రామడుగు వాణి, ఏఈఓ రవీందర్, రైతులు పాల్గొన్నారు.

సర్వే పేరుతో వచ్చి టోకరా

- వృద్ధురాలిని కట్టేసి ఆభరణాలు చోరీ
- వైరాలో పట్టపగలే దారుణం



వెంకట్రావమ్మ నుంచి వివరాలు సేకరిస్తున్న ఏసీపీ రహమాన్

వైరా: సర్వే చేస్తున్నామంటూ కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు వృద్ధురాలిని కట్టి పడేసి ఇంట్లోని సుమారు రూ.18 లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన వైరా సుందరయ్యనగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. సుందరయ్యనగర్‌కు చెందిన శీలం యుగంధర్‌రెడ్డి కొత్తగూడెంలో, ఆయన భార్య వైరాలో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిద్దరు విధులకు వెళ్లగా యుగంధర్‌రెడ్డి తల్లి, వృద్ధురాలైన వెంకట్రావమ్మ మాత్రమే ఇంట్లో ఉంది. ఈ విషయాన్ని గమనించిన నలుగురు వ్యక్తులు బుధవారం కారులో వచ్చారు. అందులో ఒకరు పోలీసు దుస్తుల్లో ఉండగా, ఆయన ఇంట్లోకి వచ్చి సర్వే పేరుతో వచ్చి వెంకట్రావమ్మను పలు ప్రశ్నలు అడిగాడు. ఆతర్వాత ఆమె మరో గదిలోకి వెళ్తుండగా బయట ఉన్న ముగ్గురు జొరబడి నోటికి ప్లాస్టర్ వేయడంతో పాటు చేతులు కట్టేశారు. అనంతరం బెడ్‌రూమ్ బీరువాలోని సుమారు రూ.18లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. మధ్యాహ్న భోజనం చేయడానికి ఇంటికి వచ్చిన కోడలు తలుపులు తీసి ఉండడంతో పరిశీలించగా కట్టేసిన వెంకట్రావమ్మ కనిపించింది. ఆమె డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో వైరా ఏసీపీ ఎం.ఏ.రహమాన్, సీఐ సాగర్, ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజా చేరుకుని వివరాలు సేకరించారు.

ఐదు నెలల తర్వాత అందుబాటులోకి...

ప్రకాష్‌నగర్ వంతెన పైనుండి రాకపోకలు ప్రారంభం



ప్రకాష్‌నగర్ వంతెన పైనుండి వెళ్తున్న వాహనాలు

ఖమ్మంఅర్బన్: మున్నేటిపై ఖమ్మం ప్రకాశ్‌నగర్‌లో ఉన్న బ్రిడ్జి పైనుంచి రాకపోకలు మొదలయ్యాయి. పాలేరు, మధిర నియోజకవర్గాల పరిధి గ్రామాలతో పాటు కోదాడ వైపు నుండి ఖమ్మంలోకి వచ్చేందుకు ఇది ప్రధాన రహదారి కావడం, గత ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన వరదతో బ్రిడ్జిపై స్పాన్లు దెబ్బతినడంతో రాకపోకలు నిలిపివేసిన విషయం విదితమే. ఆతర్వాత కింది భాగంలో చప్టాపై రాకపోకలకు అవకాశమిచ్చినా భారీ వాహనాలకు అనుమతి ఇవ్వలేదు. ఫలితంగా వివిధ ప్రాంతాల నుంచి ఖమ్మం మార్కెట్‌కు పంట ఉత్పత్తులు తీసుకొచ్చే రైతులు, ఇతర వాహనదారులు చుట్టూ తిరిగిరావాల్సి వచ్చేది. ఈనేపథ్యాన ఆర్అండ్‌బీ అధికారులు రూ.కోటి వ్యయంతో బ్రిడ్జికి చేపట్టిన మరమ్మతు పనులు పూర్తవడంతో బుధవారం నుండి రాకపోకలు పునరుద్ధరించారు.

క్లుప్తంగా

వ్యాక్సినేషన్ డ్రైవ్ పరిశీలన

బోనకల్: బోనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ముష్టికుంట్ల ఆరోగ్య ఉపకేంద్రంలో వ్యాధి నిరోధక టీకాల డ్రైవ్‌ను జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ చింతల వెంకటరమణ బుధవారం తనిఖీ చేశారు. వ్యాక్సిన్ల నిల్వలు, రికార్డుల్లో నమోదుపై ఉద్యోగులకు సూచనలు చేశారు. పిల్లల ఎదుగుదలను పరిశీలిస్తూ అవసరమైతే వైద్యాధికారి వద్దకు పంపించాలని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ స్రవంతి, సీహెచ్‌ఓ దానయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదవుల్లో చైతన్యానికి కృషి చేయాలి..



మోహన్‌రావు, తదితరులతో జిల్లా నాయకులు

ఖమ్మంఅర్బన్: యాదవులను మరింతగా చైతన్యవంతం చేసేందుకు యాదవ విద్యావంతుల వేదిక బాధ్యులు కృషి చేయాలని తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు కూరాకుల నాగభూషణం సూచించారు. విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడిగా చెక్కిలాల మోహన్‌రావుకు బాధ్యతలు అప్పగించిన నేపథ్యాన ఖమ్మంలో బుధవారం జరిగిన సత్తుపల్లి నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మోహన్‌రావు మాట్లాడుతూ జిల్లాలోని యాదవ విద్యావంతులందరిని ఏకం చేసి అందరి అభ్యున్నతికి పాటుపడతామని తెలిపారు.ఈ సమావేశంలో గుమ్మా రోశయ్య యాదవ్, బారి మాల్సూర్, కోడి లింగయ్య, చిత్తారు ఇందుమతి, గోసు వీరభద్రం, డాక్టర్ నూతలకంటి పెద్దిరాజు, కొప్పుల గోవిందరావు, కర్రి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో వ్యక్తికి జైలుశిక్ష

ఖమ్మం లీగల్: అజాగ్రత్తగా ట్రాక్టర్ నడిపి విద్యార్థి మృతికి కారణమైన ఖమ్మం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన డ్రైవర్ చెరుకూరి వెంకటేశ్వర్లుకు ఏడాది జైలుశిక్ష, జరిమానా విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ ఏపూరి బిందుప్రియ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... 2017 అక్టోబర్ 24న ముదిగొండకు చెందిన షేక్ లాల్‌సాహెబ్ కుమారుడు మన్సూర్ అలీ బట్టలు కొనడానికి మోటార్ సైకిల్‌పై స్నేహితులతో కలిసి ఖమ్మం వెళ్లి వస్తుండగా వెంకటగిరి క్రాస్ సమీపాన ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్వర్లు అజాగ్రత్తగా నడుపుతూ ఢీకొట్టాడు. ఈ ఘటనలో మన్సూర్ అలీకి తీవ్రగాయాలతో మృతి చెందగా మిగతా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈమేరకు లాల్‌సాహెబ్ ఫిర్యాదుతో కసు నమోదు చేసిన ముదిగొండ పోలీసులు కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ఈ మేరకు కేసు విచారణ అనంతరం వెంకటేశ్వర్లుపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరి క్రాస్ – ప్రకాష్‌నగర్ బ్రిడ్జి మధ్య బుధవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో మోతుకూరి నాగేంద్రబాబు(36) మృతి చెందాడు. వెంకటగిరి ఇందిరమ్మ కాలనీకి చెందిన కార్పెంటర్ నాగేంద్రబాబు బైక్‌పై ఖమ్మం వెళ్తుండగా ఖమ్మం వైపు నుండి ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చిన బైరు గోపాలకృష్ణ ఢీకొట్టాడు. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన నాగేంద్రబాబును 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన బాబాయి రమేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.రాజు తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసుల చోరీ

ఎర్రుపాలెం: మండలంలోని నారాయణపురం శివార్లలో ఓ మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు లాక్కెళ్లారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన జొన్నిబోయిన వెంకటరమణ, జమలయ్య ఎర్రుపాలెం మండలం జమలాపురానికి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. నారాయణపురం సమీపాన వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు(మగ, ఆడ) జమలమ్మ బైక్‌పై వెనకాల కూర్చున్న వెంకటరమణ మెడలో నుంచి 68గ్రాముల నాన్‌తాడు, నల్లపూసల గొలుసు లాక్కుని వేగంగా పారిపోయారు. ఈ విషయమై బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.వెంకటేష్ తెలిపారు. కాగా, చోరీ జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాల పుటేజీ ద్వారా బైక్‌పై ఒక మగ, ఆడ మనిషి వేగంగా వెళ్తున్న దృశ్యాలను సేకరించారు.

ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు సీజ్

సత్తుపల్లి: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం సత్తుపల్లి ఎస్ఐ ఎన్.వీరేందర్, గిర్దావర్ ఎస్.కే.జానీమియా బుధవారం సీజ్ చేశారు. అలాగే, పెదవంతెన సమీపంలోని నిల్వ చేసిన ఇసుకను సైతం సీజ్ చేసినట్లు తెలిపారు. కాగా, ఏపీ నుంచి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు గంగారంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును సత్తుపల్లి పట్టణ సీఐ కిరణ్ ప్రారంభించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

చర్చి వార్షికోత్సవానికి వేళాయె..

- విచారణ స్థాపించి 72 ఏళ్లు, లూర్దుమాత చర్చి నిర్మించి 27 ఏళ్లు
- ఖమ్మం జిల్లాలోనే అతి పెద్ద ఆలయం



తల్లాడలోని లూర్దుమాత ఆలయం

తల్లాడ: తల్లాడలో 72 ఏళ్ల కిందట విచారణ మొదలు కాగా, ఇక్కడ నిర్మించిన లూర్దుమాత చర్చికి 27 ఏళ్లు నిండుతున్నాయి. 1997 ఫిబ్రవరి 16న తల్లాడలోని రాష్ట్రీయ రహదారిని ఆనుకుని ఖమ్మం మేత్రాసనం ఆధ్వర్యంలో చర్చి నిర్మించారు. ఈ చర్చి జిల్లాలోనే అతి పెద్దదిగా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నేపథ్యాన గురువారం నుంచి మూడు రోజుల పాటు వార్షిక ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

ఆలయ విశిష్టత

తల్లాడలో రాష్ట్రీయ రహదారి పక్కనే నిర్మించిన లూర్దుమాత చర్చి ఎత్తయిన నిర్మాణం. ఆవరణలో బాల ఏసు, మరియ లూర్దుమాత విగ్రహాలు కనిపిస్తాయి. 27 ఏళ్ల కిందట రోమన్ కేథలిక్ మిషన్ ఆధ్వర్యాన నిర్మించిన చర్చి ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఆలయంలో కల్వరి కొండలు, ఏసుక్రీస్తు జీవిత విశేషాలతో పాటు లూర్దుమాత చిత్రపటాలు ఆకట్టుకునేలా ఏర్పాటు చేశారు. చర్చి గోపురం 150 అడుగుల ఎత్తుతో ఉండగా, ఒకేసారి 3 వేల మంది ప్రార్థన చేసేలా హాలు, బాల్కనీ ఉంటుంది. ఇక ఆలయంపై ఉన్న గంట ప్రతిరోజూ తెల్లవారుజామున మోగించినప్పుడు కిలోమీటర్ దూరం వరకు వినిపిస్తుంది. ఈ ఆలయంలో ఏటా క్రిస్మస్, కొత్త సంవత్సరం వేడుకలతో పాటు ఫిబ్రవరిలో గుడి పండుగ, లూర్దుమాత ఉత్సవాలు నిర్వహిస్తారు. అలాగే, ప్రతీ ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయి. కాగా, ఈ చర్చికి అనుబంధంగా గోపాలపేట, మిట్టపల్లి, కుర్నవల్లి, రెడ్డిగూడెంల్లో చర్చిలు కొనసాగుతుండగా, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

మూడు రోజుల పాటు వేడుకలు

చర్చిలో గురువారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు లూర్దుమాత ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జెండా ఆవిష్కరణ, దివ్య బలి పూజతో ఉత్సవాలు మొదలవుతాయి. రోజూ ప్రత్యేక ప్రార్థనలు, దివ్య బలిపూజ, చివరి రోజైన 15వ తేదీన ఖమ్మం పీఠాధిపతులు సగిలి ప్రకాశ్ ఆధ్వర్యంలో పరిశుద్ధ జపమాల, సమష్టి దివ్య బలిపూజ నిర్వహించనున్నారు.

వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



27 ఏళ్ల కిందట లూర్దుమాత ఆలయాన్ని ఖమ్మం పీఠం ఆధ్వర్యాన నిర్మించగా జిల్లాలోనే ప్రఖ్యాతి గాంచింది. వార్షికోత్సవంలో ప్రత్యేక ప్రార్థనల కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. కమిటీ ఆధ్వర్యంలో చివరిరోజైన 15వ తేదీన అన్నదానం ఉంటుంది.

–అజయ్, విచారణ గురువు, లూర్దుమాత ఆలయం

మూడు రోజులు పండుగే



లూర్దుమాత ఆలయంలో మూడు రోజుల పండుగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతిరోజు ప్రార్థనలు, దివ్య బలిపూజ ఉంటాయి. వివిధ ప్రాంతాల ఫాదర్లు సందేశం ఇవ్వనున్నారు. ఈ వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతారు.

– మూకర చార్లెస్, నారాయణపురం

మరోమారు గెలిపిస్తే సమస్యలపై పోరాటం

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



ఓట్లు అభ్యర్థిస్తున్న అభ్యర్థి నర్సిరెడ్డి

మధిర/ఎర్రుపాలెం: గత ఆరేళ్లుగా ఉపాధ్యాయుల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్న తనను మరోమారు గెలిపించాలని, తద్వారా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మరింత ఒత్తిడి తీసుకొస్తానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. ఖమ్మం – నల్లగొండ – వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి యూటీఎఫ్, టీపీటీఎఫ్ మద్దతుతో మరోమారు పోటీ చేస్తున్న ఆయన మధిర నియోజకవర్గంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మధిర, ఎర్రుపాలెంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. గత ప్రభుత్వ కాలం నుంచి విద్య ప్రైవేటీకరణకు అడుగులు పడుతున్నాయని, అందులో భాగంగానే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని పేర్కొన్నారు. నూతన పెన్షన్ విధానం రద్దు, పెండింగ్ బిల్లుల మంజూరుతో పాటు విద్యారంగం, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనను మరోమారు గెలిపించాలని ఉపాధ్యాయులను ఆయన కోరారు. ఈసమావేశాల్లో టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ విజయ్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, నాయకులు నాగూర్ వలీ, మీరాఖాన్, తాళ్లూరి ఆంజనేయులు, రావిరాల లక్ష్మణరావు, బండారు నాగరాజు, ఆశీర్వాదం, భాస్కరరావు, అనుమోలు కోటేశ్వరరావు, నంద్రు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నన్ను గెలిపిస్తే సమస్యల పరిష్కారం

టీపీయూఎస్ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి



మాట్లాడుతున్న అభ్యర్థి సరోత్తంరెడ్డి, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం – వరంగల్ – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఈనెల 27న పోలింగ్ జరగనుండగా మొదటి ప్రాధాన్యత ఓటుతో తనను గెలిపించాలని టీపీయూఎస్ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి కోరారు. ఖమ్మంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత బాధ్యులు పాలక పార్టీలకు అనుగుణంగా వ్యవహరిస్తున్న విషయాన్ని ఉపాధ్యాయులు గమనించాలని కోరారు. విద్యారంగం, అధ్యాపకులు, ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో వినిపించి సాధనకు కృషి చేసేలా తనను గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు గెంటెల విద్యసాగర్, డాక్టర్ శీలం పాపారావు, దొంగల సత్యనారాయణ, శ్రీలతారెడ్డి, శ్యాంరాథోడ్, సున్నా రవికుమార్, అల్లిక అంజయ్య, ధనియాకుల వెంకటనారాయణ యాదవ్, ఆర్‌వీఎస్.యాదవ్, గడీల నరేష్, చింతమల్ల వీరస్వామి, డీకొండ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సరోత్తంరెడ్డిని గెలిపించాలి

ఖమ్మంరూరల్: అసెంబ్లీ ఎన్నికల సమయాన ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేలా ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి సర్వోత్తంరెడ్డిని గెలిపించాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి కోరారు. ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్ రోడ్డులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు వీరభద్రం, ఎం.శ్రీనివాసరావు, ఎల్.సాగర్, కె.వెంకన్న, మల్లారెడ్డి, పి.సుధాకర్, నాగరాజు, వెంకన్న పాల్గొన్నారు.

రెండు రాష్ట్రాలస్థాయి పౌరాణిక నాటక పోటీలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మధిర: మండలంలోని మాటూరుపేటకు చెందిన శ్రీసీతారామాంజనేయ కళాపరిషత్ ఆధ్వ ర్యాన ఈ నెల 21 నుంచి మూడురోజుల పాటు రెండు తెలుగు రాష్ట్రాలస్థాయి పౌరాణిక నాటక పోటీలు నిర్వహించనున్నామని కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, అధ్యక్షుడు గడ్డం సుబ్బారావు తెలిపారు. బుధవారం మాటూరుపేటలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ ఆవరణలో పోటీల కరపత్రాలను ఆవిష్కరించాక వారు మాట్లాడా రు. అనేక ఏళ్లుగా పౌరాణిక నాటక పోటీలు నిర్వహిస్తూ కళారంగం, కళాకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాయల కోటయ్య, గుర్రాల కృష్ణారెడ్డి, మాదల రామారావు, కృష్ణమూర్తి, నరసింహారావు, రావూరి రామారావు, గంద్ర నర్సయ్య, చిలువే రు శాంతయ్య, సంక్రాంతి వీరయ్య, కొర్లగంటి మాధవరావు, గడ్డం శ్రీహరి, కృష్ణ, శ్రీనివాసరావు, బ్రహ్మం, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం వద్ద రగడ

ఎన్‌ఎస్‌యూఐ ఆందోళన.. బీజేపీ నేతల రాస్తారోకో



వాగ్వాదానికి దిగిన బీజేపీ - ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

సత్తుపల్లి: సత్తుపల్లిలోని బీజేపీ కార్యాలయం వద్ద బుధవారం ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకులు సోషల్‌మీడియాలో అనుచితంగా పోస్టులు పెడుతున్నారని ఆరోపిస్తూ ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు అర్వపల్లి సందీప్‌గౌడ్‌తో పాటు నంద్రు ప్రశాంత్ తదితరులు బీజేపీ కార్యాలయం వద్దకు వెళ్లారు. అక్కడ బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, నాయుడు రాఘవరావు, మున్నా మిశ్రాతో వాగ్వాదానికి దిగగా వారు సైతం ప్రతివిమర్శలకు దిగారు. బీజేపీ 21 రాష్ట్రాల్లో అధికారంలో ఉందని, కాంగ్రెస్‌కు మూడు రాష్ట్రాల్లోనే అధికారం ఉన్న విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. రోడ్డుపై ఇరువర్గాలు వాగ్వాదానికి దిగడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఎదురయ్యాయి. ఇంతలోనే బీజేపీ నాయకులు రహదారిపై బైఠాయించగా సత్తుపల్లి సీఐ టి.కిరణ్ చేరుకుని ఇరువర్గాలకు నచ్చెప్పారు. ఆతర్వాత ఎన్‌ఎస్‌యూఐ నాయకులు సందీప్‌గౌడ్, నంద్రు ప్రసాద్‌ను తీసుకెళ్లారు. కాగా, బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడికి దిగటం గర్హనీయమని బీజేపీ నాయకుడు నంబూరి రామలింగేశ్వరరావు, ఈ.వీ. రమేష్, పుల్లారావ్ యాదవ్ పేర్కొన్నారు. ఈ విషయమై కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డికి సమాచారం ఇవ్వగా పోలీసులకు ఫిర్యాదు చేశామని, జాతీయ ఎస్సీ, ఎస్టీ బీసీ కమిషన్ల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కాగా, రాహుల్ గాంధీని విమర్శిస్తూ బీజేపీ నాయకులు పాలకొల్లు శ్రీను, ఆచంటి నాగస్వామి, విజయ్ పోస్టులు పెడుతుండడంతో విషయాన్ని ఆ పార్టీ నేతల దృష్టికి తీసుకెళ్లేందుకు వెళ్లామని ఎన్‌ఎస్‌యూఐ నాయకుడు సందీప్‌గౌడ్ తెలిపారు.

మిర్చి ధర పతనంతో రైతుల్లో ఆందోళన

- వ్యాపారుల తీరుతో ఎనలేని నష్టం
- అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: గతేడాది క్వింటా మిర్చికి రూ.20 వేల నుంచి రూ.25 వేల ధర పలికితే ఇప్పుడు అందుకు విరుద్ధమైన పరిస్థితులు ఉండడంతో రైతులకు ఎనలేని నష్టం జరుగుతోందని అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) నాయకులు పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెచ్చల రంగారెడ్డి, ఉప్పల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు గుమ్మడి నర్సయ్య తదితరులు బుధవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెండా పాటను రూ.13 వేలకు పాడుతున్నా అంతకంటే తక్కువ ధరతో కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఎగుమతులు లేవనే సాగుతో వ్యాపారులు సిండికేట్ మారి ధర తగ్గిస్తున్నారని, ఆపై కమీషన్ వ్యాపారులు మరింత నష్టానికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాక హమాలీ చార్జీలు సైతం రైతులపై మోపుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇకనైనా మిర్చి రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మార్కెట్ చైర్మన్, కార్యదర్శులకు సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, నాయకులు గుర్రం అచ్చయ్య, చంద్ర అరుణ, కోలేటి నాగేశ్వరరావు, కమ్మకోమటి నాగేశ్వరరావు, పాశం అప్పారావు, కేలోతు లక్ష్మణ్, కుర్ర వెంకన్న, ధరావత్ లక్ష్మణ్, గూగులోత్ తేజ, వడ్డే వెంకటేశ్వర్లు, బందెల వెంకయ్య పాల్గొన్నారు.

సైలో బంకర్ నుంచి దుమ్ము లేవకుండా చర్యలు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీలోని సైలోబంకర్ నుంచి బొగ్గు దుమ్ము లేవకుండా అన్ని చర్యలు తీసుకుంటామని సింగరేణి డైరెక్టర్(ఈఅండ్‌ఎం) డి.సత్యనారాయణరావు వెల్లడించారు. దుమ్ముతో అనారోగ్యం పాలవుతున్నామని కిష్టారం అంబేద్కర్‌నగర్ వాసులు రెండు రోజులుగా దీక్షలు చేపట్టారు. ఈనేపథ్యాన డైరెక్టర్ బుధవారం కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజుతో కలిసి సైలో బంకర్‌ను పరిశీలించారు. అదనంగా దుమ్ము నియంత్రణ యంత్రాలు ఏర్పాటు చేయాలని, బొగ్గును తడుపుతూ లోడింగ్ చేయాలని ఉద్యోగులకు సూచించారు. అలాగే, పర్యావరణ శాఖ అధికారులతో చర్చించి కాలుష్య నమోదు యంత్రం ఏర్పాటుచేయాలని, బంకర్ చుట్టూ చెట్లు పెంచాలని తెలిపారు. ఈకార్యక్రమంలో జీఎంలు తిరుమలరావు, సూర్యనారాయణ, ఏరియా ఇంజనీర్ సూర్యనారాయణరాజు, ఏజీఎం రామకృష్ణ, పీఓ ప్రహ్లాద్, సీహెచ్‌పీ ఇన్‌చార్జ్ సోమశేఖర్ పాల్గొన్నారు. కాగా, అంబేద్కర్ నగర్ వాసుల దీక్షా శిబిరాన్ని సీపీఎం నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. నాయకులు జాజిరి శ్రీనివాస్, కొలికపోగు సర్వేశ్వరరావు, నాగేశ్వరరావు, ప్రభాకర్, రాజు, కుమారి, నాగరత్నం పాల్గొన్నారు.

పస్తులతో ఉండలేక... ఆరోగ్యం సహకరించక

ఆత్మహత్య ముందు లేఖ రాసిన వృద్ధ దంపతులు

ఖమ్మంక్రైం: ఆర్థిక బాధలతో పస్తులు ఉండలేక, వృద్ధాప్యంలో ఎదురైన అనారోగ్యానికి వైద్యం చేయించుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఖమ్మం బ్యాంక్ కాలనీలో మంగళవారం రాత్రి బలవన్మరణానికి పాల్పడిన నరసింహారావు లేఖ రాసినట్లు తెలిసింది. ఆయన తన భార్యకు ఉరి వేసి ఆపై ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. కష్టపడి దాచుకున్న డబ్బును అప్పుగా ఇస్తే, తిరిగి రాకపోవడంతో వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో ఎవరికీ భారం కావొద్దని ఈ నిర్ణయం తీసుకున్నామని ఆ లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. భార్య కోటమ్మకు పక్షవాతం రావడం, తాను సైతం అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స చేయించుకోవడానికి డబ్బు లేక ఇబ్బందులు పెరిగాయని అందులో రాసినట్లు తెలిసింది. గతంలో తాను పనిచేసిన హోటల్ నిర్వాహకులు రూ.2.50లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వకపోయినా తమ తరపున మాట్లాడే వారెవరూ లేక ఆవేదనతో ఆత్మహత్య చేసుకుంటున్నామని ఆయన రాసినట్లు చెబుతున్న లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే, ఆ లేఖను మాత్రం పోలీసులు బుధవారం కూడా బయటపెట్టలేదు.

మార్చురీలోనే మృతదేహాలు

ఏపీలోని నరసరావుపేటకు చెందిన నరసింహారావు, కోటమ్మ మృతదేహాలను ఖమ్మం ఆస్పత్రిలో మార్చురీలో భద్రపరిచారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారని గతంలో వెల్లడించినా వారి ఆచూకీ తెలియరాలేదు. సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించినా చిరునామా తెలియలేదని పోలీసులు తెలిపారు. అలాగే, నరసింహారావు రాసిన లేఖ ఆధారంగా దర్యాప్తు కొనసాగుతోందని ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

కండక్టర్ బ్యాగ్‌లో నగదు చోరీ

సత్తుపల్లిటౌన్: బస్సు ఎక్కుతున్న సమయాన మహిళా కండక్టర్ క్యాష్ బ్యాగ్‌లోని నగదును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. సత్తుపల్లి బస్టాండ్ నుంచి బుధవారం ఖమ్మం వెళ్లిన ఓ బస్సుకు కండక్టర్‌గా షబానాబేగం విధులు నిర్వర్తించారు. నగదుతో ఉన్న క్యాష్‌బ్యాగ్‌తో బస్సు ఎక్కుతుండగా అందులో నుంచి రూ.2,840 అపహరించారు. బస్సు ఎక్కాక గుర్తించగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆటోలో నుంచి మిర్చి బస్తాలు...

తిరుమలాయపాలెం: మార్కెట్‌కు తరలించేందుకు ఆటోలో వేసిన మిర్చి బస్తాలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటనపై బుధవారం కేసు నమోదైంది. జూపెడ, బచ్చోడుతండాకు చెందిన దోసేపల్లి వెంకన్న, బాసు ఖమ్మం మార్కెట్‌కు మిర్చి తీసుకెళ్లేందుకు మంగళవారం రాత్రి ఆటోలో లోడ్ చేశారు. బుధవారం ఉదయం ఎనిమిది బస్తాలు తక్కువగా ఉన్నాయి. దీంతో చోరీ జరిగినట్లు వారి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి చేశారని ఆర్మీ జవాన్ ఫిర్యాదు

చింతకాని: కేసు విచారణ నిమిత్తం చింతకాని పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన తనపై పలువురు స్టేషన్ ఆవరణలోనే దాడి చేశారని బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బూదాల మనోజ్ తెలిపారు. నాగులవంచలోని పెట్రోల్ బంక్‌లో ఐదు రోజుల క్రితం జరిగిన ఘర్షణ కేసు విచారణకు బుధవారం తాను ఎస్సై వద్దకు వెళ్తుండగా అక్కడే ఉన్న ఉమ్మనేని రమేష్, లగడపాటి సాయి దాడి చేశారని వెల్లడించాడు. ఈమేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. ఈవిషయమై ఎస్సై నాగుల్‌మీరా మాట్లాడుతూ విచచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.